## క్లుప్తంగా

### చురుగ్గా పింఛన్ల పంపిణీ



వివేకానంద ఆశ్రమంలో వృద్ధులకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ లత

**డాబాగార్డెన్స్ :** జీవీఎంసీ 39వ వార్డు పరిధి స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఆశ్రమంలో నిరాశ్రయం పొందుతున్న పలువురు వృద్ధులకు ఆదివారం పింఛన్లు అందజేశారు. వార్డు వలంటీర్ లత వేకువ జాము 6 గంటలకే సంస్థకు వెళ్లి అక్కడి వృద్ధులకు పింఛన్ అందజేశారు.

### జోన్-5లో 89 శాతం పూర్తి



జోన్-5 గొల్ల కంచరపాలెంలో వృద్ధురాలి నుంచి వేలిముద్రలు సేకరిస్తున్న వలంటీర్

**కంచరపాలెం:** జీవీఎంసీ జోన్-5 పరిధిలో తొలి రోజు సుమారు 89 శాతం వైఎస్సార్ పెన్షన్ల పంపిణీ పూర్తి చేసినట్లు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, యూసీడీ ఏపీడీ పద్మావతి తెలిపారు. ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాల్లోని 24 వార్డులకు సంబంధించి టీపీఆర్వో ఏపీడీ, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీల నేతృత్వంలో ఆదివారం వలంటీర్లు ఆయా లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారన్నారు. జోన్ పరిధిలో మొత్తం 26,929 మంది లబ్ధిదారులకు గానూ 24,059 మందికి ఇళ్ల వద్ద సచివాలయ కార్యదర్శుల సమక్షంలో వలంటీర్లు పింఛన్ డబ్బులు అందించినట్లు చెప్పారు. ఇళ్లకే కాకుండా ఆస్పత్రులకు వెళ్లి పెన్షన్ అందజేశారన్నారు. సోమవారానికి 100 శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని జెడ్సీ కృష్ణ తెలిపారు. జోన్-5 ఏపీడీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పూర్తి స్థాయిలో పనిచేయాలని ఆయన ఆదేశించారు.

### విద్యార్థిని అదృశ్యం

**మర్రిపాలెం:** కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 17 ఏళ్ల విద్యార్థిని అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. చిత్తూరు హనీషా అనే బాలిక వన్‌టౌన్ ప్రాంతంలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తోంది. జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. గత నెల 30న శనివారం ఉదయం 8.30 గంటల సమయంలో సోదరుడు ఆమెను కాలేజీ వద్ద డ్రాప్ చేశాడు. కాలేజీ వదిలే సమయం సాయంత్రం సుమారు 4.30 గంటలకు అక్కడికి వచ్చి వేచి ఉండగా.. ఎంతసేపటికి సోదరి రాలేదు. అంతటా వెతికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం హనీషా తల్లి చిత్తూరు లక్ష్మి కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఎస్ఐ దివ్యభారతి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### 'హర్షకుమార్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి'

**డాబాగార్డెన్స్ :** కాంగ్రెస్ పార్టీలో ఉంటూ.. బాధ్యతాయుత సీనియర్ నాయకులపై విమర్శలు చేస్తున్న మాజీ ఎంపీ హర్షకుమార్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు గొంప గోవిందరాజు డిమాండ్ చేశారు. ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో హర్షకుమార్ వ్యాఖ్యలు ఖండించారు. రాజమండ్రిలో హర్షకుమార్ ప్రెస్‌మీట్ పెట్టి చంద్రబాబుకు అనుకూలంగా మాట్లాడడమే కాక, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ కేవీపీ రామచంద్రరావు, ఏఐసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేశారన్నారు. సమావేశంలో కె.లక్ష్మి, సూర్యనారాయణ, బాషా, కె. చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.





దుర్గాలమ్మ గుడి వద్ద శ్రమదానం చేస్తున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు తదితరులు



ఏవీఎన్ కళాశాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు, విద్యార్థులు



39వ వార్డులో శుభ్రం చేస్తున్న కార్పొరేటర్ మహ్మద్ సాధిక్

# చేతులు కలిపి.. స్వచ్ఛత నిలిపి

- నియోజకవర్గంలో ఏక్ తారీక్ - ఏక్ ఘంటా శ్రమదానం
- ఉత్సాహంగా పాల్గొన్న నాయకులు, అధికారులు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని నాయకులు, అధికారులు తెలిపారు. స్వచ్ఛ భారత్ అభియాన్ పిలుపు మేరకు నిర్వహించిన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం ఆదివారం పలుచోట్ల నిర్వహించారు. నాయకులు, అధికారులు పాల్గొని పలు చోట్ల చెత్త తొలగించారు.



జ్ఞానాపురంలో రహదారిని శుభ్రం చేస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ



మున్సిపల్ పార్కులో శ్రమదానం చేస్తున్న తోట పద్మావతి తదితరులు

**డాబాగార్డెన్స్ :** స్వచ్ఛ భారత్ అభియాన్ పిలుపు మేరకు స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పిలుపు మేరకు విశాఖ నియోజకవర్గ పరిధి పలు వార్డుల్లో ఆదివారం ఏక్ తారీక్-ఏక్ గంట శ్రమదానం నిర్వహించారు. నగరంలో అన్ని వార్డుల్లో గల బహిరంగ ప్రదేశాలు, పార్కులు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, దేవాలయాల్లో విశాఖ నగర పరిశుభ్రతకు ఓ గంట పాటు మనందరం శ్రమదానం కార్యక్రమంలో పాల్గొందామని కమిషనర్ ఇచ్చిన పిలుపు మేరకు నియోజకవర్గ పరిధిలో పెద్ద ఎత్తున శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు.

**35వ వార్డులో..**

జీవీఎంసీ 35వ వార్డు పరిధిలో ఆ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. వార్డు పరిధి దుర్గాలమ్మ గుడి నుంచి పూర్ణామార్కెట్ వరకు చెత్తా చెదారాలు తొలగించారు. కార్యక్రమంలో దుర్గాలమ్మ గుడి చైర్మన్ నాయన మల్లిబాబు, ధర్మకర్త బత్తి మంగరాజు, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, శ్రీనివాస్, సిబ్బంది, పార్టీ నాయకులు, సచివాలయ శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

**ఏవీఎన్ కళాశాలలో..**

ఏవీఎన్ కళాశాలలో ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల వైస్ చైర్మన్, కరస్పాండెంట్ ఏవీ భానోజీరావు ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో చెత్తా చెదారాలు తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ సమయంలో కూడా గాంధీ స్వచ్ఛత పాటించడంలో ముందుండేవారని తెలిపారు.

**29వ వార్డులో..**

**మహారాణిపేట :** జీవీఎంసీ 29వ వార్డులో ఆదివారం వార్డులోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ ఉరికిటి నారాయణరావు చెత్త తొలగించారు. బీచ్ రోడ్డు, ఊటగెడ్డ, రామజోగిపేట, అంథోనీనగర్ ఏరియాల్లో కార్పొరేటర్ నారాయణరావుతో పాటు ఇతర నాయకులు పాల్గొని శుభ్రం చేశారు. వార్డు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, శానిటరీ ఇనస్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.



జెండాచెట్టువీధిలో ప్రమాణం చేస్తున్న తోట పద్మావతి, జీవీఎంసీ సిబ్బంది

**హార్బర్‌లో శ్రమదానం..**

- భారతీయ మత్స్య పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఫిషింగ్ హార్బర్‌లో సామూహిక స్వచ్ఛతా కార్యక్రమం జరిగింది. సంస్థ ముఖ్య అధికారి డి.భామిరెడ్డి ఆధ్వర్యంలో హార్బర్‌లోని 5,6 జెట్టీల్లో చెత్త తొలగించారు. ఈ సందర్భంగా 700 కిలోల ప్లాస్టిక్ సీసాలు, కవర్లు, తెగిపోయిన చేప వలల వ్యర్థాలను సేకరించి జీవీఎంసీ సిబ్బందికి అందజేశారు.

**జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్‌లో..**

**కంచరపాలెం :** జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్‌లో ఆదివారం కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ ఏక్ దిన్.. ఏక్ గంట.. ఏక్ సాత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. గాంధీ మహాత్ముని స్ఫూర్తితో దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం చేపడుతున్నారని అన్నారు. వైఎస్సార్‌సీపీ అర్బన్ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డీవీఎస్ఎన్ ప్రసాద్, సూపర్‌వైజర్ అర్జున్, నాని, వెళంగిణిరావు, కల్యాణ్, ప్రభాత్, శ్యామ్‌సుందర్‌రెడ్డి, శ్రీనివాస్, చంద్రరావు, పారిశుధ్య సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



చెత్త ఎత్తుతున్న వార్డు కార్పొరేటర్ ఉరికిటి నారాయణరావు తదితరులు

**39వ వార్డులో..**

**జగదాంబ :** జీవీఎంసీ 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ ఆధ్వర్యంలో ఆదివారం పలు ప్రాంతాల్లో శ్రమదానం చేశారు. పాతపోస్టాఫీసు, ఫెర్రీరోడ్డు, లక్ష్మీ టాకీసు ప్రాంతాల్లో రోడ్లు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు వలంటీర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**వాడవాడలా ఏక్ తారీఖ్..ఏక్ గంట**

**అల్లిపురం :** ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ఆదివారం వాడవాడలా ఏక్ తారీఖ్..ఏక్ గంటా.. కార్యక్రమం నిర్వహించారు. దీంట్లో భాగంగా 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి వార్డులో కొబ్బరితోట, జెండాచెట్టు, మున్సిపల్ పార్కు ప్రాంతాల్లో శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె శానిటరీ వర్కర్లు, వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు, కార్యకర్తలతో ప్రమాణం చేయించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లండ రమణ, లింగం శ్రీను, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

**33వ వార్డులో..**

కుమ్మరవీధి సచివాలయం పరిధిలో స్వచ్ఛతా పక్వాడా, ఏక్ తారీఖ్.. ఏక్ గంటా.. కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సచివాలయం పరిధిలో శ్రమదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పాల శ్రీహరిరెడ్డి, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.



కుమ్మరవీధి సచివాలయంలో శ్రమదానం చేస్తున్న సచివాలయం సిబ్బంది



హార్బర్ జెట్టీలో చెత్త తొలగిస్తున్న మత్స్య పరిశోధన సంస్థ సిబ్బంది

## మర్యాదపూర్వక కలయిక



వైవీ సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న బాజీ నాయుడు, జీఎం రెడ్డి

**విశాఖ-లీగల్ :** వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ప్రతినిధి వర్గం ఆదివారం విశాఖ విమానాశ్రయంలో మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా సుబ్బారెడ్డిని శాలువతో కప్పి సన్మానం చేశారు. లీగల్‌సెల్ అధ్యక్షుడిగా నియమించడం పట్ల బాజి నాయుడు, కన్వీనర్ జీఎంరెడ్డి తదితరులు సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

**కంచరపాలెం :** కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం భాద్రపద మాస శుద్ధ విదియ ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 దర్శనాలు కల్పించారు. భక్తులు ఆలయ పరిసరాల్లో వంటా వార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సిబ్బంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

## ప్రేమసమాజంలో మాజీ ఎమ్మెల్యే వాసుదేవరావు జయంతి



వృద్ధురాళ్లకు చీరలు అందిస్తున్న పిన్నింటి ఆదిమూర్తి

**డాబాగార్డెన్స్:** మాజీ ఎమ్మెల్యే, విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు, విశాఖ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఈశ్వరపు వాసుదేవరావు 93వ జయంతి కార్యక్రమం ఆదివారం ప్రేమసమాజంలో నిర్వహించారు. యదు ఫైన్‌ఆర్ట్స్ వ్యవస్థాపకుడు పిన్నింటి ఆదిమూర్తి యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు యాదవ కులస్థులు పాల్గొని వాసుదేవరావు సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ప్రేమసమాజం వృద్ధులు, బాలబాలికలకు నూతన వస్త్రాలు అందజేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రవికుమార్, గొలగాని అప్పారావు, కిషోర్, రాజేశ్వరి, పల్లా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మూఢ నమ్మకాలు పారదోలాలి

**మహారాణిపేట :** గ్రామీణ ప్రాంతాల్లో మూఢ నమ్మకాలతో సరైన వైద్యం చేయించుకోక మరణాలు సంభవిస్తున్నాయని, ఆర్‌ఎంపీ వైద్యులు దీనికి అడ్డుకట్ట వేయాలని జన విజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి అన్నారు. రామ్‌నగర్‌లోని జేవీవీ నాయకుడు సోమేష్ మాస్టారు స్వగృహానికి విచ్చేసిన ఆయనను ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జంగం జోషి ఆధ్వర్యంలో పలువురు ఆర్‌ఎంపీ వైద్యులు సత్కరించారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ యునైటెడ్ కలాం ఫౌండేషన్ ఏపీ అధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు మాట్లాడుతూ అమాయక ప్రజల మూఢ నమ్మకాలను పారద్రోలడంతో పాటు డాక్టర్ బ్రహ్మారెడ్డి ప్రజా వైద్యునిగా కూడా గుర్తింపు పొందారని ప్రశంసించారు. విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు కె.వెంకటరావు, మురళి, చిరంజీవి, భాస్కరరావు, జేవీవీ నాయకులు గోపాల్ నాయక్, బాషా, స్వామి నాయుడు, యోహాను పాల్గొన్నారు.



జన విజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు బ్రహ్మారెడ్డిని సత్కరిస్తున్న ఆర్‌ఎంపీ వైద్యులు

## జూనియర్ జేసీఐ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

**సీతమ్మధార :** ద్వారకానగర్‌లోని గాయత్రి విద్యా పరిషత్ కళాశాలలో ఆదివారం జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ (జేసీఐ) వైజాగ్ యువ చాప్టర్ అనుబంధ జూనియర్ జేసీఐ కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. నూతన అధ్యక్షురాలిగా గీతికారెడ్డి ఎన్నికయ్యారు. మాజీ అధ్యక్షురాలు పూజిత నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. కార్యదర్శిగా లక్ష్మి, సంయుక్త కార్య దర్శిగా రూప ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం గాంధీ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జేసీఐ వైజాగ్ యువ అధ్యక్షులు కె. ప్రమోద్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రజని, కేఎంకే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాల్లో ముందుంటాం

**మురళీనగర్:** సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో ముందుందామంటూ వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా ప్రెసిడెంట్ డాక్టర్ డి.డి.నాయుడు పిలుపునిచ్చారు. మురళీనగర్ జయరామ ఫంక్షన్ హాల్లో స్థానిక వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు వి.ప్రభాశర్మ ఆధ్వర్యంలో వాకర్స్ డిస్ట్రిక్ట్-101 గవర్నర్ ఉప్పలపాటి శుభ అధ్యక్షతన ఆదివారం డిస్ట్రిక్ట్-101 నాలుగో క్యాబినెట్ సమావేశం నిర్వహించారు. విశాఖ ఉమ్మడి జిల్లాలు, శ్రీకాకుళం, విజయనగరం ఉమ్మడి జిల్లాల నుంచి వాకర్స్ క్లబ్‌ల ప్రధాన బాధ్యులు, మహిళా వాకర్స్ క్లబ్‌ల ప్రతినిధులు అత్యధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకర్స్ క్లబ్ సభ్యులు ప్రజల్లో నిరంతరం ఆరోగ్య స్పృహను కల్పించడంలో ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తారన్నారు. శుభ మాట్లాడుతూ వాకర్స్ క్లబ్ సభ్యులు సమన్వయంతో పనిచేసి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. వాకర్స్ క్లబ్‌ల ప్రతినిధులు వారి ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల వివరాలు తెలియజేశారు. ఎంజీఎఫ్ సభ్యులు, పూర్వ క్లబ్ అధ్యక్షులు, పూర్వ గవర్నర్లు, ఇతర పెద్దలను ఘనంగా సత్కరించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వాకర్స్ ఇంటర్నేషనల్ సెక్రటరీ జనరల్ సేలం ఐజక్, అడిషనల్ సెక్రటరీ జనరల్ ఆర్.సత్యనాథం, ఇమ్మీడియట్ పాస్ట్ గవర్నర్ వాకర్ డాక్టర్ నందూరి రామకృష్ణ, ఏఎహెచ్ఎస్ వెంకటరావు, ఎ.లక్ష్మీరెడ్డి, ఎలెక్ట్ గవర్నర్ టి.రంగారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాయుడు

### వృద్ధులకు వాకర్స్ క్లబ్ వితరణ

**మురళీనగర్:** ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఆధ్వర్యంలో శ్రీనివాసనగర్‌లోని బంగారు తల్లి వృద్ధాశ్రమాన్ని సందర్శించి వృద్ధుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. వృద్ధులకు తువ్వాళ్లు, పండ్లు పంపిణీ చేశారు. తువ్వాళ్ల కొనుగోలుకు వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు ప్రధాన కార్యదర్శి రాళ్లపల్లి సత్యనాథం ఆర్థిక సాయం అందించారు. క్లబ్ ఉపాధ్యక్షుడు ఆదిభట్ల రామకృష్ణ, జాలీ వాకర్ ప్రకాశరావు, కార్యవర్గ సభ్యులు ఆర్. నాగేశ్వరరావు, బి.సూర్యనారాయణ, సబ్బినేని రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

## నవ్వులు పూయించిన కామెడీ షో

**సీతంపేట:** ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వినోదాల విందు కామెడీ షో ప్రేక్షకులను అలరించింది. క్లబ్ వ్యవస్థాపకుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ సభ్యులు, విశాఖ హ్యూమర్ క్లబ్ సభ్యులు, క్రియేటివ్ కామెడీ క్లబ్ సభ్యులు, విశాఖ రత్న కామెడీ, హాస్య ప్రియ, హాస్య దర్బారు క్లబ్ సభ్యులు కామెడీ స్కిట్లు ప్రదర్శించి ప్రేక్షకులను నవ్వించారు. వీటిలో లాయర్ పరాంకుశం, బట్టల షాపు, పేకాట రాదన్నావు, కవితల ఆవిష్కరణ, మూడు మాత్రలు స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. కళాకారులు జబర్దస్త్ ప్రకాశ్, ఎం.వి.సుబ్రహ్మణ్యం, డేవిడ్‌రాజు, రావి గోపీకృష్ణ, శివజ్యోతి, నాయుడు, పుష్యమి, అనూరాధ, కుమారి, పోర్టు శేషు, శ్రీధర్ ప్రదర్శించిన కామెడీ స్కిట్లు నవ్వులు పూయించాయి. అనంతరం యువ నాటకోత్సవాల్లో ముళ్లతేగలు, ఇంతింతే నాటకాలు ప్రదర్శించిన కళాకారులను సత్కరించారు.



స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

## షాడోగ్రఫీపై పిల్లలకు శిక్షణ



వర్చువల్ సెషన్ ద్వారా పిల్లలకు షాడోగ్రఫీలో టెక్నిక్స్ నేర్పుతున్న రేఖావ్యాస్

**సీతంపేట:** ముంబైకి చెందిన షాడో గ్రాఫిస్ట్ రేఖా వ్యాస్ వర్చువల్ సెషన్ ద్వారా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయం మియావాకీలో పిల్లలకు హ్యాండ్ షాడోగ్రఫీని నేర్పించారు. చాలా మందికి కథలు చదవడం, వినడం ఇష్టపడతారని, పప్పెట్ షో, షాడోగ్రఫీతో కథలు చెప్పినపుడు ఆనందం రెట్టింపవుతుందని ఆమె అన్నారు. ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు పిల్లల్లో వినోదం, సృజనాత్మకత కల్పనను రేకెత్తిస్తాయని, పఠనాశక్తిని, పుస్తకాలపై ప్రేమను కలిగిస్తాయన్నారు. రేఖా వ్యాస్ ఇంటరాక్షన్ విద్యార్థులను ఎంతగానో ఆకర్షించి షాడోగ్రఫీలో లీనమయ్యేలా చేసింది. షాడోగ్రఫీతో ఎలా కథలు చెప్పాలి, దానికి సంబంధించిన ఉపాయాలు, టెక్నిక్స్, కొన్ని రకాల హ్యాండ్ షాడోలు ఎలా తయారు చేయాలో పిల్లలకు నేర్పించారు.

## వైఎస్సార్‌సీపీలోకి నాగమల్లేశ్వరి



వైవీ సుబ్బారెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న బీజేపీ నాయకురాలు నాగమల్లేశ్వరి

**డాబాగార్డెన్స్:** బీజేపీ నాయకురాలు, న్యూ హోప్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ మంచా నాగ మల్లేశ్వరి వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ఆమెకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సుబ్బారెడ్డి క్యాంప్ ఆఫీస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. ఈ ప్రభుత్వంలో మహిళలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేస్తానని చెప్పారు.